## గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం

- ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి, మరొకరి పరిస్థితి విషమం








2 లో

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 30 | ఏప్రిల్ | 2025
పేజీలు 8

# ఇందిరమ్మ ఇండ్లపై రాజకీయ ఒత్తిళ్లు..!



### -లబ్ధిదారుల ఎంపికలో సతమతమవుతున్న అధికారులు
### -సరికొత్త రూల్స్‌తో లబ్ధిదారుల పరేషాన్

**ప్రజాపక్షం/ఖమ్మం :** గ్రామాల్లో సందడి చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువవుతున్నాయి. అధికార యంత్రాంగం లబ్ధిదారుల ఎంపికలో ఒత్తిళ్ల నడుమ సతమతమవుతున్నారు. ఇండ్ల దరఖాస్తులను పరిశీలించిన అధికారులు మూడు దశలుగా లబ్ధిదారులను విభజించారు. ఎల్ 1, ఎల్2, ఎల్ 3 గా విభజించి ప్రాధాన్యత క్రమంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. గతంలో లబ్ధిదారులుగా ఉన్న వారికి, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ఓ కాంగ్రెస్ నాయకునికి రెండు ఇండ్లు ఉండగా తన సభ్యురాలిని ఎంపిక చేసి రెండు ఇండ్ల మధ్యలో ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకునేందుకు అధికారులపై తీవ్ర ఒత్తిడి తేవడంతో పాటు తాను ఒక ప్రజాప్రతినిధికి ప్రధాన అనుచరుడినంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. నియోజక వర్గానికి 3,500 ఇండ్ల పంపిణీకి సంబంధించి గ్రామాల్లో కాంగ్రెస్ నేతలను సంతృప్తి పరిచే రీతిలో ఇండ్లను కేటాయించారు. గ్రామస్థాయి నాయకులు, అనుచరులకు కేటాయించి వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని పట్టుబడుతున్నారు. రాజకీయ పోటీలో అతి నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు దక్కే పరిస్థితి కనిపించడం లేదు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయన్న ప్రచార నేపథ్యంలో గ్రామాల్లో స్థానిక నేతలు లబ్ధిదారుల ఎంపికలో మితిమిరిన జోక్యం

మిగతా 2లో..

# పిలవని అధికారులు.. అలిగిన ఎంఎల్ఎ..!





**ప్రజాపక్షం/ ఖమ్మం/ అశ్వారావుపేట :** అధికారుల తప్పిదం ఒక శాసన సభ్యున్ని తీవ్ర ఆవేదనకు గురి చేసింది. తనకు తెలియకుండానే తన నియోజక వర్గంలో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు మంత్రి కార్యక్రమం ఏర్పాటు చేయడంపై ఆయన తన నిరసను వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సముదాయించేందుకు ప్రయత్నించిన శాసన సభ్యుడు వినలేదు. వివరాల్లోకి వెళితే... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజక వర్గ పరిధిలోని దమ్మపేట మండలం గిరిజన గ్రామమైన పుసుకుంట గ్రామంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రోడ్ల నిర్మాణానికి శంకు

### -సముదాయించిన మంత్రి తుమ్మల

స్థాపన చేసేందుకు వెళ్లారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి అధికారులు తనకు సమాచారం ఇవ్వలేదని స్థానిక శాసన సభ్యుడు జారె ఆదినారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు కనీస సమాచారం ఇవ్వకుండ తన నియోజక వర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ దశలో ఆదినారాయణ అధికారులపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తనకు సమాచారం ఇచ్చారా అంటూ మంత్రి సమక్షంలోనే

మిగతా 2లో..

# కొండరెడ్ల గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### - పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అడవిని నమ్ముకుని జీవించే కొండరెడ్ల గిరిజనుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా నెలకోసారి ఆ గ్రామాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకుని జిల్లా కలెక్టర్, ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకెళ్లి వారిని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం దమ్మపేట మండలం

మిగతా 2లో..



# ధరణి ఫలితంగానే బిఆర్ఎస్ ప్రభుత్వం కూలిపోయింది..

-దేశంలో రోల్ మోడల్‌గా భూ భారతి చట్టం నిలుస్తుంది

-కడుపు ఎందుకు మండుతోంది కేసీఆర్...!

-రాష్ట్రంలో నాలుగు వేల మంది సర్వేయర్‌లు రానున్నారు..

-మంత్రి పొంగులేటి

వివరాలు 2లో..



# ఇందిరమ్మ ఇండ్లపై రాజకీయ ఒత్తిళ్లు..!

(మొదటిపేజీ తరువాయి)
చేసుకుంటున్నారు.

**నిబంధనలతో పరేషాన్ :**
ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు లబ్ధిదారులను పరేషాన్ చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారునికి రెండున్నర ఎకరాల భూమి కాని, రూ. 50వేలకు మించి పంట రుణం ఉన్న దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నట్లేనట. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడు నిర్మించే ఇల్లు 400 నుంచి 600 చదరపు అడుగులు ఉండాలని నిబంధన విధించారు. 400 చదరపు అడుగులకు తగ్గిన 600 చదరపు అడుగులకు పెరిగినా లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించక తప్పదని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ నిబంధనలు, లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం వెరసి తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ప్రభుత్వ సంకల్పం తొలి దశలో అతి నిరుపేదలను ఎంపిక చేయాల్సి ఉండగా ప్రస్తుత పరిస్థితుల్లో అధికార యంత్రాంగం లబ్ధిదారుల ఎంపిక తీరు కీలకం కానుంది. ఇదే సమయంలో పైరవీకారుల జోరు పెరిగింది. మాకు డబ్బులిస్తే మీ ఇంటికి డోకా లేదంటూ ప్రచారం ప్రారంభించడంతో పాటు ఆయా గ్రామాలను బట్టి రూ. 40వేల నుంచి రూ. 50వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. ఎంఎల్ఎ, మంత్రి కూడా మాకు చాలా దగ్గరని మండలాధికారులు మాతో సన్నిహితంగా ఉంటారు. మాకు డబ్బులిస్తే మీ ఇంటికి వచ్చిన డోకా లేదంటూ భరోసా ఇచ్చి వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కామేపల్లిలో పంచాయతీ కార్యదర్శులు కొందరు ఇంటికి రూ. 40వేలు చొప్పున వసూలు చేస్తున్నారని ఉన్నతాధికారుల మధ్యనే మంగళవారం చర్చ జరిగిందంటే పరిస్థితి ఎలా ఉందో అవగతం చేసుకోవచ్చు.

# కొండరెడ్ల గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)
పూసుకుంట గ్రామాని వెళ్లే మార్గంలో రూ.4.18కోట్ల వ్యయంతో నిర్మించిన కల్వర్టులను ఆయన ప్రారంభించారు. అనంతరం పూసుకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో నివసించే కొండరెడ్ల గిరిజన గ్రామాలకు సరైన రోడ్లు సౌకర్యం, విద్యా వైద్యం, లాంటి మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతుంటే వారి సమస్యలను దృష్టిలో పెట్టుకుని గత జనవరి నెలలో ఫారెస్ట్ వారి అనుమతి తీసుకుని కల్వర్టుల నిర్మాణం కోసం శంకుస్థాపనలు చేయడం జరిగిందని తెలిపారు. కొండరెడ్ల గ్రామాలకు మౌలిక వసతుల కల్పనకు ఫారెస్ట్ అధికారులు సహకరించాలని తెలిపారు. కొండరెడ్ల కుటుంబాల జీవనస్థితిగతులను అధ్యయనం చేసుకుని అధికారులు నిబద్ధతగా పనిచేయాలని ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలన్నారు. అదేవిధంగా గిరిజన రైతులకు ఫామాయిల్ తోటలు పెంపకం, హార్టికల్చర్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు ఇచ్చి సాగులో లాభాలు పొందే విధంగా వ్యవసాయాధికారులు కృషి చేయాలన్నారు. కొండరెడ్ల గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధిచెందే విధంగా అన్నిశాఖల అధికారులు సమన్వయతో పనిచేయాలన్నారు. దమ్ముపేట మండలంలోని పర్యటించిన తుమ్మల పూసుకుంట కట్కూరు గ్రామాల్లో ఇటీవలే నిర్మించిన మూడు బ్రిడ్జిలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధి పట్ల ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆలోచనలకు అనుగుణంగా తాను ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు కేటాయించి అన్ని విధాల మౌలిక వసతుల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటిడిఎ పిఓ రాముల్, ఆర్‌డిఓ మధు, జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు, వివిధశాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ధరణి ఫలితంగానే
# బిఆర్ఎస్ ప్రభుత్వం కూలిపోయింది..



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం దేశంలోనే రోల్ మోడల్ గా నిలుస్తుందని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలం లోని సుర్దేపల్లి లో మంగళవారం జరిగిన భూభారతి చట్టం పై అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఏ పని చేసినా ప్రజలకు ఉపయోగపడాలని చేస్తుందని అన్నారు. ప్రజల కోసం ప్రభుత్వం ఒక జీవో తీసుకొస్తే ప్రజల సమస్యలు తీర్చేది గా ఉండాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లో హోదావుడి గా తన కుటుంబానికి దోచిపెట్టాలని అరరహితంగా ధరణి ని తీసుకొచ్చారని అన్నారు. ధరణి 2020 చట్టం ఫలితంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కూలిపోయిందని అన్నారు. 18 రాష్ట్రాలలో రెవిన్యూ చట్టాలను పరిశీలించి భూ భారతి చట్టం తీసుకొచ్చామని అన్నారు. 2025 భూ భారతి చట్టం తీసుకొచ్చి ప్రజలకు అంకితం చేశామని అన్నారు. గత బీఆర్ఎస్ తీసుకొచ్చిన ధరణి చట్టం లో విధి విధానాలు లేవన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అమలు చేసిన భూ భారతి చట్టం లో అన్ని విధి విధానాలు అమలు చేశామని అన్నారు. నేలకొండపల్లి మండలం లోని 2300 అప్లికేషన్ లు వచ్చాయని తెలిపారు. ప్రతీ జిల్లాలో 40 శాతం సాదా బైనామా అంశాలే పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లో 9 లక్షల 26 వేల మంది సాదా బైనామా కి అప్లికేషన్ లు పెట్టుకున్నారని అన్నారు. అసలు ధరణి లో సాదా బైనామా ఊసేలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర పరిస్థితి చూసి దుఃఖం అగడం లేదని కేసీఆర్ చెపుతున్నారని.. ఎందుకు ఉద్యోగం పీకారని...లేక పేద వారు సన్న బియ్యం తింటున్నారనా...భూమి సమస్యలు పరిష్కారమవుతున్నాయని కడుపు మండుతుందా అన్నారు. అనాటి ప్రభుత్వం లో మంత్రులను కూడ కలిసే పరిస్థితి లేదని అన్నారు. ధనిక రాష్ట్రం ను అప్పుల పాలు చేస్తే...అప్పులు తీర్చుకుంటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. అనాడు ధరణి ఉన్నప్పుడు భూమి ఉన్న ప్రతీ అసామి భయానికి గురయ్యేవారని అన్నారు. ఇప్పుడు భూ భారతి చట్టంలో రైతుల అన్ని సమస్యలు పరిష్కారం లభిస్తుందని అన్నారు. అనాడు ఇందిరా గాంధీ పేదలకు "భూముల పంపిణీ చేసిందని అన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక". చేసిన నాలుగు మండలాల్లో రేపటికి రెవిన్యూ సదస్సులు పూర్తవుతాయని అన్నారు. భూ వివాద రహిత మండలాలు గా ఈ నాలుగు మండలాలు ఉంటాయని అన్నారు. మే 5 నుంచి రాష్ట్రంలో మిగతా జిల్లాలో ఒక్కో మండలం ను పైలెట్ ప్రాజెక్ట్ గా తీసుకుంటామని అన్నారు. జూన్ 3 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ రెవిన్యూ గ్రామంకు అధికారులు వస్తారని అన్నారు. ఆగస్టు 15 లోపు మొదటి పేస్ లో రెవిన్యూ సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మరో 15 రోజులలో నాలుగు వేల మంది సర్వేయర్ లను తీసుకుని ప్రతీ మండలానికి ఐదుగురు నునియమిస్తామని అన్నారు. కాంట్రాక్టు సర్వేయర్ లతో పాటు 1000 మంది ప్రభుత్వం సర్వేయర్ లను తీసుకుంటామని అన్నారు. 23 వేల మంది రెవిన్యూ సిబ్బంది ని రోడ్డు న పడేశారని అన్నారు. భూ భారతి చట్టం లో అనేక కొత్త కార్యక్రమాలు తీసుకొచ్చినట్లు తెలిపారు. వేరే రాష్ట్రంలో చట్టం అమలు చేయాలన్న మన భూ భారతి చట్టం చూసి అమలు చేస్తారని అన్నారు. జూన్ 2 నుంచి యువత కు రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేస్తామని అన్నారు. అంతకు ముందు నాచేపల్లి లో రహదారి నిర్మాణం కు శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ ముజమ్మిలాఖాన్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు. శాఖమూరి రమేష్, వజ్జా రమ్య, వెంకన్న, గరిడేపల్లి రామారావు, బచ్చలకూరి నాగరాజు, భద్రయ్య, బోయిన వేణు, చెరువు స్వర్ణ, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం

**ప్రజాపక్షం/ తల్లాడ :** గ్యాస్ సిలెండర్ మారుస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకై జరిగిన అగ్ని ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందగా, మరోకరి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో గుత్తికొండ వినోద్ చెల్లెల మార్తెలు ప్రిన్సి(9), లింసీ(5) ఇద్దరు వేసవి సెలవులు కావడంతో మిట్టపల్లి గ్రామంలోని మేనమామ ఇంటికి వచ్చారు. అలాగే గుత్తికొండ వినోద తల్లి సుశీల(70) పెద్ద కుమారుడు తరుణ్(8), వరుణ్(8) ఇద్దరు కవలపిల్లలు వేసవి సెలవులు కావడంతో అందరూ ఇంట్లోనే ఉన్నారు. సోమవారం రాత్రి 8గంటల సమయంలో గ్యాస్ అయిపోయిందని గమనించిన గుత్తికొండ వినోద్ మరొక గ్యాస్ సిలెండర్‌ను బిగిస్తున్న సమయంలో ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో ఇంట్లో ఉన్న దుస్తులకు మంటలు అంటుకుని దట్టమైన పొగలు వ్యాపించాయి. మంటల్లో చిక్కుకున్న వినోద్, సుశీల, వరణ్, ప్రిన్సి, లింసీలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108లో ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించగా గుత్తికొండ వినోద్ చిన్నకుమారుడు తరుణ్ పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు 108 వాహనం ద్వారా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం చికిత్స పొందుతూ తరుణ్ మృతి చెందగా గాయపడ్డ వారిలో తల్లి సుశీల ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమార్తె లింసీ పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఘటన జరిగినప్పుడు పిల్లలు స్నానం చేసి అప్పుడే ఇంట్లోకొచ్చారని ఇంతలోనే ఇలా గ్యాస్ అయిపోవడంతో మరొక గ్యాస్ సిలెండర్‌ను బిగిస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ సమయంలో వినోద్ భార్య రేవతి సరుకులు కొనడానికి దుకాణానికి వెళ్లడంతో ప్రమాదం నుండి బయటపడింది. ఈ ఘటనతో మిట్టపల్లి గ్రామంలో, బాధితుల కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానిక పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పిలవని అధికారులు..
# అలిగిన ఎంఎల్ఎ..!

(మొదటిపేజీ తరువాయి)
అధికారులను నిలదీశారు. అధికారులు తాము సమాచారం ఇవ్వలేదని అంగీకరించినట్లు సమాచారం. మంత్రి తుమ్మల ఈ సమయంలో జోక్యం చేసుకుని శంకుస్థాపన కార్యక్రమానికి కొబ్బరికాయ కొట్టాలని పలుమార్లు శాసన సభ్యుడు ఆదినారాయణను కోరిన తాను కొబ్బరికాయ కొట్టడం కాని ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరగదని చెప్పి నిరసన వ్యక్తం చేశారు. ఒక దశలో ఎంఎల్ఎ వర్గీయులు శంకుస్థాపన కార్యక్రమాన్ని జరుపవద్దని అడ్డుకునే ప్రయత్నం చేశారు. మంత్రి తుమ్మల అధికారులను ఒక దశలో తీవ్రంగానే మందలించారు. సర్పంచ్ మొదలు ప్రజాప్రతినిధులందరికీ సమాచారం ఇవ్వాలని శాసన సభ్యులను అభివృద్ధి కార్యక్రమాలకు ఇంటికి వెళ్లి ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు. జారె ఆదినారాయణను తన కారులో ఎక్కించుకుని మిగిలిన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తీసుకెళ్లారు. గతంలో ఇదే ప్రాంతంలో ఒక మండల అధికారి ప్రోటోకాల్ పాటించకపోవడం, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంతో క్రమశిక్షణ చర్యలకు గురైన విషయం గమనార్హం.

## నిరంతరం విద్యుత్ సరఫరానే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నిరంతరం విద్యుత్ సరఫరా అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు కూసుమంచి ఏడీ కోక్యానాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో లోవోల్టేజ్ సమస్యను నివారించేందుకు నూతన ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా విద్యుత్ సేవలు మరింత మెరుగ్గా పని చేసేందుకు కొత్త ట్రాన్స్ ఫార్మర్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా వినియోగదారుల కోసం అనేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈదురు గాలుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విద్యుత్ ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నేలకొండపల్లి ఏఈ కె.రామారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో
## ప్రియదర్శిని విద్యార్థినుల ప్రతిభ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురంమున్సిపాలిటీపరిధి లోని పెద్దతండలో గల ప్రియదర్శిని ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ మహిళ కళాశాల విద్యార్థినిలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో మంగళవారం ప్రతిభ చాటారు. ప్రముఖ అంతర్జాతీయ సంస్థ జెన్‌పెక్ట్‌కు బిటెక్ ఫైనల్ ఇయర్‌కు చెందిన సీఎస్ఈ, ఈసీఈ, సీఎస్ఎం, ఎఐటి నుంచి 10మంది విద్యార్థినిలు ఎంపికయ్యారు. వీరిని కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బత్తుల గోపాల్, అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# లాటరీ ద్వారా పారదర్శకంగా బార్ల కేటాయింపు

-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : లాటరీ ద్వారా పారదర్శకంగా జిల్లాలో మూతబడిన రెండు బార్ల లైసెన్స్‌దారును ఎంపిక చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మూతబడిన రెండు బార్లకు సంబంధించి లైసెన్స్‌దారుల ఎంపిక ప్రక్రియలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. జిల్లాలోమూతబడిన 2బి బార్లకు 112 మంది అభ్యర్థుల ద్వారా 145 దరఖాస్తులు వచ్చాయని దరఖాస్తుదారుల సమక్షంలో పారదర్శకంగా లాటరీ పద్ధతిన బార్ల లైసెన్స్‌దారుల ఎంపిక చేశామని ఆయన తెలిపారు. బార్ల కేటాయింపు మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. లాటరీ ద్వారా సీరియల్ నెం.13కు సంబంధించి జుట్టు కొండ లక్ష్మి నారాయణ, సీరియల్ నెం. 135కు సంబంధించి గుండవరం రాజేశ్వరరావు లను లైసెన్స్ దారులుగా ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వీరు ప్రభుత్వం నిర్దేశించిన ఎక్సైజ్ ట్యాక్స్‌ను వెంటనే చెల్లించి కన్‌ఫర్‌మేషన్ లెటర్ తీసుకోవాలని సూచించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి. జనార్ధన్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్ రెడ్డి, జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వై. వేణుగోపాల్‌రెడ్డి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి. కృష్ణ, ఎక్సైజ్ అధికారులు, దరఖాస్తుదారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మేడే వేడుకలను ఘనంగా నిర్వహించండి

-సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా




ప్రజాపక్షం/ఖమ్మం : మారిన రాజకీయ పరిస్థితులు హరించబడుతున్న కార్మిక హక్కుల నేపథ్యంలో మేడేను ఘనంగా నిర్వహించాలని సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా కోరారు. వాడ వాడలా అరుణ పతాకాలను ఆవిష్కరించి కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ప్రతిన బూనాలన్నారు. సిపిఐ వన్‌టౌన్ ఏరియా సమావేశం మంగళవారం యాకూబ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జానిమియా మాట్లాడుతూ అనేక దశాబ్దాల పాటు కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం హరించివేస్తుందన్నారు. లేబర్ కోడ్స్‌తో కార్మికుల భవిష్యత్తు యూనియన్ల మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అన్ని రంగాల కార్మికులపైన లేబర్ కోడ్స్ పనిచేస్తాయని మారిన రవాణా చట్టాల నేపథ్యంలో ఆటో డ్రైవర్ల మొదలు ప్రతి ఒక్కరు ఇబ్బందులు పడక తప్పదని జానిమియా తెలిపారు. సంపద పోగుపడుతున్న నేపథ్యంలో కార్మిక హక్కుల కోసం ఎర్ర జెండాల నీడలో భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. రానున్న కాలంలో కార్మిక హక్కుల పరిరక్షణ, బడుగు, బలహీన వర్గాల జీవనోపాధిలో మార్పుకై పోరాటాలే మార్గమన్నారు. ఈ సమావేశంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి పగడాల మల్లేష్, సిపిఐ నాయకులు వరద నర్సింహారావు, మాదుగుల నాగేశ్వరరావు, మాల కొండయ్య, మెంటెం రవి, కారం సామెలు, యాతం భూపాల్‌రెడ్డి, సిద్ది శ్రీనివాసరావు, నర్సింహారావు, శీలం నాగేశ్వరరావు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణం తొలగింపు

- ప్రభుత్వ భూమి, ప్లాట్ల కబ్జాకు పాల్పడితే కఠిన చర్యలు : తహశీల్దార్



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని పెద్దతండా రెవిన్యూలో గల ఇందిరమ్మ కాలనీలోని సర్వేనెంబర్ 142లో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని రెవిన్యూ, మున్సిపాలిటీ, పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...మేకల ఉదయ్‌కుమార్ ప్రభుత్వ ప్లాట్‌ను ఆక్రమించి సతీష్ అనే వ్యక్తికి విక్రయించాడు. ప్లాట్ కొనుగోలు చేసుకున్న వ్యక్తి అందులో ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు రెవిన్యూ అధికారులు సర్వే చేయగా..అది ప్రభుత్వ భూమిలోని ఖాళీ ప్లాట్‌గా నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో అక్రమ నిర్మాణాన్ని జేసీబీ సాయంతో తొలగింపు చేపించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పి. రాంప్రసాద్ మాట్లాడుతూ...దళారుల మాటలు నమ్మి ప్రభుత్వ స్థలాలు కొనుగోలు చేసుకొని మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్‌లో లబ్దిదారులు మాత్రమే నిర్మాణం చేసుకోవాలని సూచించారు. ఆ ప్లాట్‌కు సైతం ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇచ్చిన సమయంలోపు నిర్మాణం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు, ప్లాట్ల కబ్జాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ఇందిరమ్మ కాలనీలో చోటు చేసుకున్న ప్లాట్ల ఆక్రమణలపై అందిన ఫిర్యాదుల మేరకు రెవిన్యూ,మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి పరిశీలన చేసి ఆక్రమణలను గుర్తించి తొలగించనున్నట్లు తెలిసింది. ఈ దందాను గత ప్రభుత్వంలోని అధికార పార్టీకి చెందిన కొందరు నేతలే పాల్పడినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, రెవిన్యూ ఆర్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# వెంకీస్ కంప్యూటర్స్‌లో విద్యార్థులకు ఉచిత శిక్షణ




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : వెంకీస్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ కంప్యూటర్ కోర్సులలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వెంకీస్ కంప్యూటర్ నిర్వాహకులు బాలినేని వెంకీనాయుడు, దివ్యలు తెలిపారు. చార్డ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఖమ్మం నగరంలోని నెహ్రూనగర్‌లో గల వెంకీస్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ నందు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వారి కంప్యూటర్ కోర్సులైన ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ, డిటిపి, స్పోకెన్ ఇంగ్లీష్, వెబ్ డెవలప్‌మెంట్, సాఫ్ట్‌వేర్ C, C+, AI, పైథాన్ కోర్సులలో ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌తో ఎంవోయు చేసుకున్నట్లు వారు తెలిపారు. దానికి సంబంధించి అధికారిక పత్రాలు కూడా అందుకోవడం జరిగిందన్నారు. పై కోర్సులలో ప్రతి బ్యాచ్‌కు 30 నుండి 60 మంది యువతీ యువకులను తీసుకోవడం జరుగుతుందని వారు తెలపారు. దీనికి 18 నుండి 26 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చార్డ్ ఎంజివో అధ్యక్షులు సామాల బాబు, ఉపాధ్యక్షులు గుడిచుట్ల రామనాథం తదితరులు పాల్గొన్నారు. శిక్షణకు సంబంధించి మరిన్ని వివరాలకు సెల్ నెం. 9642009966, 8886661964 నెంబర్లను సంప్రదించాలని వారు తెలిపారు.

# నాయీ బ్రాహ్మణ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం జిల్లా నాయీ బ్రాహ్మణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మం గళవారం బుర్హాన్‌పురంలోని నాయీ బ్రాహ్మణ లక్ష్మి కళ్యాణ మండపం నందు తెలంగాణ రాష్ట్ర నాయీ బ్రా హ్మణ ఐక్య వేదిక రాష్ట్ర నాయకుల సమక్షంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖమ్మంజిల్లా నాయీ బ్రాహ్మణ ఐక్య వేదిక అధ్యక్షులుగా తూముల నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా ఆలేటి సత్యనారాయణ, గౌరవాధ్యక్షులుగా ఆలేటి వెంకటప్పయ్య, గౌరవ సలహాదారులుగా లింగంపల్లి అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుంటి సురేష్, వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా గొల్లపూడి వీరన్న, జాయింట్ సెక్రటరీగా నాగవెల్లి రాంచందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి గంగుల శ్రీనివాస్ నాయుడు నూతన కమిటీ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి మానాల కిషన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ తమ సందేశాన్ని చరవాణి ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గొంగుల శ్రీనివాస్, రాష్ట్ర సీనియర్ నాయకులు కందుల సూర్యనారాయణ, ఆర్టీఏ డైరెక్టర్ గజ్జెల్లి వెంకన్న, ఓబిసి సెల్ ఉపాధ్యక్షులు మాదారపు హరినాథ్, సీనియర్ సభ్యులు దేవరకొండ శ్రీనివాస్, కుదురుపాక శ్రీహరి, వివిధమండలాల అధ్యక్ష, కార్యదర్శులు, సీనియర్ బాధ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# సుశీలమ్మ కుటుంబానికి లింగాల పరామర్శ



ప్రజాపక్షం/బోనకల్: అమరజీవి తూము ప్రకాశ రావు సతీమణి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్ మాతృమూర్తి సిపిఐ సీనియర్ నాయకురాలు తూము సుశీలమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సుశీలమ్మ కుటుంబసభ్యులను టిఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇంచార్జి, మాజీ జడ్పి ఛైర్మన్ లింగాల కమలరాజు మంగళవారం పరామర్శించారు. సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సుశీలమ్మ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో టిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు బంధం శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, నాయకులు పారా ప్రసాద్, వల్లెబోయిన కొండలరావు, రాధకృష్ణ, సాయిబాబు తదితరులున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల రీ సర్వే కోసం మండల గెజిటెడ్ అధికారులు విచారణను క్షేత్రస్థాయిలో మంగళవారం ప్రారంభించారు. మండలం లోని నాచేపల్లి, సుర్దేపల్లి తదితర గ్రామాలలో ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు, ఆర్అండ్ ఏఈ పృధ్వీ, మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, ఇరిగేషన్ ఏఈ నరేష్, రుత్విక్రెడ్డి లు క్షేత్ర స్థాయిలో చెక్ లిస్ట్ ను చేపట్టారు. ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన జాబితా ఆధారంగా ప్రతీ ఇంటికి వెళ్లి క్షేత్ర స్థాయిలో రీ సర్వే ను పరిసరాలను పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం ఇళ్లు ఏ పరిస్థితిలో ఉంది. గోడలు ఏ విధంగా నిర్మించారు. అంతే కాకుండా పరిసర ప్రాంతాలలో లబ్దిదారుల గురించి ఆరా తీస్తున్నారు. లబ్ధిదారులు చెప్పిన వివరాలు వాస్తవమా కాదా అనే విషయంలో క్షేత్ర స్థాయిలో అన్ని కోణాలలో పరిశీలన చేస్తున్నారు. ఆయా గ్రామాలలో జరిగే సర్వే ను ఎంపీడీఓ యం.యర్రయ్య పర్యవేక్షిస్తున్నారు.

# కబడ్డీ, బ్యాడ్మింటన్ సమ్మర్ క్యాంప్



ప్రజాపక్షం/ మధిర: మధిరలోని ఇండోర్ స్టేడియంలో పట్టణ, పరిసర ప్రాంతాల విద్యార్థిని, విద్యార్థులకు, క్రీడాకారులకు కబడ్డీ, బ్యాడ్మెంటన్‌లో సమర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంఇఓ వై.ప్రభాకర్ తెలిపారు. ఖమ్మం జిల్లా స్పోర్ట్స్ అధారిటీ డివైఎస్ఓ సునీల్ రెడ్డి ఆదేశాల మేరకు ఇండోర్ స్టేడియంలోని సింథటిక్ మ్యాట్‌పై క్రీడ నైపుణ్యం కలిగిన కోచ్‌లను ఏర్పాటు చేసి మే 1 నుండి జూన్ 6వ తేదీ వరకు వేసవి శిబిరాలను ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి క్రీడాకారుడు, విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు మధిర ఇండోర్ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కమ్ ఇన్‌చార్జి పిడి వై.చిన్ని 9849125569, కోచ్ కె.ప్రవీణ్‌కుమార్ 9866657209, సునీల్ 8523067614 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

## కొనుగోలు కేంద్రంలో రైతుల గోస



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని కస్నాతండలో ఏదులాపురం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులు గోస పడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలులో చోటు చేసుకుంటున్న జాప్యంతో నిరాశ చెందుతున్నారు. గత 20రోజుల క్రితం ప్రారంభించిన కొనుగోలు కేంద్రంలో రెండు లారీలు మాత్రమే ధాన్యాన్ని తీసుకువెళ్లినట్లు తెలుపుతున్నారు. మొత్తం 30మంది రైతులకు గాను రెండు లారీల సరుకు మాత్రమే వెళ్లడంతో మరో 5,6లారీల ధాన్యం రాశులుగా పేరుకుపోయాయని పేర్కొంటున్నారు. వాటికి సరిపడ బస్తాలు సైతం లేక దుమ్ము కొట్టుకుపోతున్నాయని, ఆవేదన చెందుతున్నారు. బస్తాకు 1కేజీ400వందల గ్రాముల తరుగు తీస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రంలో కార్యాకలపాలు కొనసాగడం లేదంటున్నారు. దీనిపై సిఈఓ మహ్మద్అలీని వివరణ కోరగా...కేంద్రం ఏర్పాటు చేసిన దగ్గరు నుంచి కాంటాలయ్యి లారీలు మిల్లులకు వెళ్లినట్లు తెలిపారు. ప్రతిరోజు ఒక లారీలోడ్ అవుతుందని, కొనుగోలులో ఎటువంటి జాప్యం లేదన్నారు. రైతులకు సైతం సరిపడ బస్తాలు ఉన్నాయన్నారు.

## రాజ్యాంగం ప్రజాస్వామ్య పరిరక్షణకై పోరాటం

**-అంబేద్కర్ ప్రజాసంక్షేమ సంఘం అధ్యక్షులు లింగాల**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాజ్యాంగం ప్రజాస్వామ్య పరిరక్షణకై ప్రజలను చైతన్యపరుస్తూ చైతన్య బాటను కొనసాగిస్తామని బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు లింగాల రవికుమార్ తెలిపారు. అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పి మీటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో లింగాల రవికుమార్ మాట్లాడుతూ 1999లో అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘాన్ని స్థాపించడం జరిగిందని రవికుమార్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ శాసనసభ్యులు కొండబాలకోటేశ్వరరావు మాట్లాడుతూ 1999లో అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘాన్ని తాను ప్రారంభించడం జరిగిందని 25 ఏళ్ల తర్వాత ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సమావేశం పెహల్గాం మృతులకు సంతాపాన్ని తెలియజేసింది. ఈ కార్యక్రమంలో బాబురావు, వీరభద్రం, శ్రీనివాస్, బానోత్ కిషన్ నాయక్, యలమద్ది వెంకటేశ్వర్లు, శోభన్, గోరంట్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ లైట్లు ఆపి నిరసన

**-కేంద్రానికి కనువిప్పు కావాలి**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** విద్వేషంతో, అహంకార పూరిత ధోరణితో వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 30న రాత్రి తొమ్మిది గంటల నుంచి 9.10 నిమిషాల వరకు విద్యుత్ లైట్లు ఆపి నిరసన తెలియజేయాలని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపునిచ్చింది. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసేంత వరకు తమ నిరసనలను విరమించే ప్రసక్తే లేదని ముస్లిం లా బోర్డు తెలిపింది. మంగళవారం టిఎన్జీవోస్ ఫంక్షన్ హాల్లో జరిగిన మీడియా సమావేశంలో ముస్లిం లా బోర్డు బాధ్యులు వివిధ రాజకీయ పక్షాల నేతలు పాల్గొన్నారు. వక్ఫ్ సవరణ చట్టం 2025 రద్దు కోసం అఖిలపక్ష ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ నాయకులు తాటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సిపిఎం నగర కార్యదర్శి వై. విక్రం, బిఆర్ఎస్ అధ్యక్షులు పగడాల నాగరాజు, మాస్లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి మధు, ముస్లిం పర్సనల్ లా బోర్డు బాధ్యులు మౌలానా మహ్మద్ సహిద్, అహ్మద్ ఖాస్మి, అజారుద్దీన్, షేక్ అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు..!

**-కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు**
**-కేంద్రాల్లో ధాన్యం కుప్పలు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతన్నలకు అడుగడుగునా ఇబ్బందులే ఎదురవుతున్నాయి. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెబుతున్న వాటిలో కనీస సౌకర్యాలు లేవు. ఒకవైపు అకాల వర్షాలు రైతులను దడ పుట్టిస్తున్న. కొనుగోలు మాత్రం నత్తకె నడక నేర్పలా సాగుతున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాలు అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా పిఎసిఎస్ 14, డీసీఎంఎస్8, ఐకెపి 2, కొనుగోల కేంద్రాలను ప్రారంభించారు. మండల వ్యాప్తంగా మూడు లక్షల క్వింటాల ధాన్యం అధికారులు అంచనా వేయగా. ఇప్పటివరకు లక్ష ఇరవై రెండు వేల క్వింటాలే కొనుగోలు అయినట్లు అధికారులు తెలిపారు. మిగతా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ఆలస్యం అవుతుండటంతో ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతుల పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. గత పక్షం రోజులుగా వడగండ్ల వాన ఈదురు గాలులు ఈస్తుండడంతో కొనుగోల కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకువచ్చి పది రోజులు గడిచిన కాంటాలు కావడం లేదని పలువురు వాపోతున్నారు. కాంతలు అయిన బస్తాలను ఎప్పుడు ఎతుతారో స్పష్టత లేదని రైతులు తెలిపారు. రైతులు పిఎసిఎస్ ద్వారా మిల్లర్ల వద్దకు వెళ్లగా తాలు,తేమ అని కొర్రీలు పెడుతూ, మీ దాన్యంలో నూక ఎక్కువ వస్తుంది అంటూ ఒక క్వింటాకు 5 నుంచి 6కేజీలు కటింగ్ చొప్పున తీసుకుంటున్నారు అంటూ రైతులు వాపోతున్నారు. కానీ మిల్లర్లపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు అని రైతులు వాపోతున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈసారి అధిక దిగుబడి వచ్చింది ప్రభుత్వం బోనస్ వస్తుంది అని నేను మార్కెట్ కి ధాన్యాన్ని తీసుకువచ్చాను. తీసుకువచ్చిన 12 రోజులకు కాంటాలు వేశారు. ఎప్పుడూ ధ్యానం ఎత్తుతారో స్పష్టత లేదువాన ఎప్పుడు వస్తుందో తెలియటం లేదు అందుకని ధాన్యం వద్దనే వేచి ఉండాల్సి వస్తుంది. మరికంటి శంకర్. రైతు భైరవునిపల్లి, పండించిన పంటను రైతులు దాన్ని అమ్ముకునేందుకు అరిగోస పడుతున్నారు. ఓ పక్క తరుగు పేరుతో ధాన్యం కొనుగోల కేంద్రాలు, మరోపక్క నాణ్యత పేరుతో మిల్లర్లు అన్నదాతలను దోచుకుంటున్న పరిస్థితి, ఇదంతా అధికారులు కళ్ళ ముందే సాగుతున్న ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతన్నలు నష్టపోకుండా చూడాలి.

# మార్పు తెస్తున్న ఎంఎల్ఏ డాక్టరమ్మ

**-ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో నిరుపేదలకు పెద్దపీట**
**-శరవేగంగా అభివృద్ధి చెందుతున్న గ్రామాలు**
**-ఆగమాగం కాకుండా ఆలోచించి నిర్ణయాలు**
**-కష్టపడ్డ వారికే ఫలితం**
**-శరవేగంగా మారుతున్న సమీకరణాలు**
**-ఎం.ఎల్.ఏ డాక్టరమ్మ పాలనపై ప్రశంసల వర్షం**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే డాక్టరమ్మ మట్టా రాగమయి దయానంద్ పాలన మార్పు తేస్తుందంటున్నారు రాజకీయ విశ్లేషకులు. సత్తుపల్లి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతుండటమే కాకుండా, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన నిరుపేదలకు అందటమే ఇందుకు ప్రధాన కారణమని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. మట్టా కుటుంబానికి ప్రజలు అందించిన పదవికి సంపూర్ణ న్యాయం చేస్తూ ప్రజల నుండి ప్రశంసలు అందుకుంటున్నారని మేధావులు చెప్తున్నారు. ఎమ్మెల్యేగా డా.మట్టా రాగమయి రాష్ట్ర రాజధానిలో క్షణం తీరిక లేకుండా రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు ఆయా శాఖల మంత్రులను కలుస్తూ, నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించటమే కాకుండా సమస్యల పరిష్కారానికి అభివృద్ధి నిధులు సాధిస్తున్నారని, అదే సమయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ సైతం అలుపెరగని సైనికుడిలా ఆయా గ్రామాలు, మండలాల్లో పర్యటిస్తూ కార్యకర్తలను కలుసుకుంటూ అందరిమాట వింటూ ఆగమాగం కాకుండా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నారని, పదవి కొత్తదైనా ప్రజలను పాలించే విషయంలో మాత్రం పరిణతి చెందిన నాయకులుగా భార్యభర్తలు పని చేస్తున్నారని ప్రజలు కొనియాడుతున్నారు.

**ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో నిరుపేదలకు పెద్దపీట...**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక సత్తుపల్లి నియోజకవర్గంలో నిష్పక్షపాతంగా జరుగుతుందని, ఎమ్మెల్యే దంపతులు నిరుపేదలకే పెద్దపీట వేస్తున్నారని, సంక్షేమ పథకాల అమలులో నిజమైన అర్హులకి న్యాయం జరుగుతుందని, చోటా మోటా నాయకులు అనర్హుల పేర్లను ఒకటి, అర వారి ముందుకు తెచ్చినా, మొహమాటం లేకుండా వారి మనస్సు నొప్పించకుండా, సున్నితంగా తిరస్కరించి, పార్టీలతో సంబంధం లేకుండా ఇందిరమ్మ ఇండ్లను నిజమైన నిరుపేద లబ్దిదారులకు అందిస్తున్నారు.



**కష్టపడ్డ వారికి ఫలితం..**

గెలుపోటములు ఎదురైనప్పుడు తమను నమ్మి తమ వెంట ఉండి కష్టపడిన ప్రతి ఒక్కరికి తప్పకుండా రానున్న రోజులలో ఫలితం దక్కుతుందని, ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలను గుర్తించి, పరిష్కరించే వారికి స్థానిక సంస్థల ఎన్నికలలో సైతం అవకాశాలు దక్కుతాయనే సంకేతాలు ఎమ్మెల్యే క్యాంపు నుండి అందుతున్నట్లు సమాచారం.

**ఎమ్మెల్యే డాక్టరమ్మకు ప్రత్యేక గుర్తింపు....**

మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టరమ్మ రాష్ట్ర రాజధానిలో ప్రత్యేక గుర్తింపు సాధించుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు ఆయా శాఖల మంత్రులు కూడా ప్రజల కోసం ఆమె పడుతున్న కష్టాన్ని చూసి ఫిదా అయిపోతున్నారని, ప్రతిపక్ష పార్టీల ఆరోపణలకు దీటైన సమాధానాలిస్తూ, రాష్ట్ర ప్రభుత్వంపై ఎటువంటి విమర్శల రాకుండా ఆమె పాలన సాగిస్తున్న పాలనకు మంచి మార్కులు పడుతున్నట్లు సమాచారం. అంతేకాకుండా తనను గెలిపించిన ప్రజల కోసం మండుటెండలను లెక్క చెయ్యకుండా నియోజకవర్గంలో పర్యటిస్తూ చెరగని చిరునవ్వుతో ప్రతి పనిని చక్కబెడుతున్నారని ప్రజలు కీర్తిస్తున్నారు. రానున్న రోజులలో తిరుగులేని రాజకీయ శక్తిగా డాక్టరమ్మ మారుతుందని, ప్రజాక్షేత్రంలో డాక్టరమ్మ మార్క్ తప్పకుండా కనిపిస్తుందని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అనర్హులను తొలగించాలి

**-గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం**
**-రెండు గంటల పాటు సెక్రటరీ నిర్బంధం**
**-పోలీసులు సాయంతో తాళాలు పగలగొట్టిన సిబ్బంది**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు తీరు స్మృతిమించుతుంది. ఇందిరమ్మ ఇళ్ల కోసం అసలు దరఖాస్తులు చేయని ఇళ్లు ఉన్న ఆర్థిక బడాబాబులు పేర్లను లిస్ట్ లో ఎంపిక చేయడం తో ఆగ్రహించిన గ్రామస్తులు ఏకంగా కార్యదర్శి నే రెండు గంటల పాటు గ్రామ పంచాయతీ కార్యాలయంలో తాళాలు వేసి నిర్బంధించారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని కార్యాలయం కు ఉన్న తాళాలను సిబ్బంది సహాయంతో పగులగొట్టి సెక్రటరీ శ్రీనివాస్ ను బయటకు తీసిన సంఘటన ముదిగొండ మండలం లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వనం వారి కృష్ణా పురం లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 450 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఆ తర్వాత అధికారులు విచారణ లో 61 మంది స్థలం ఉండి ఇళ్లు లేనివారు కాగా మరో 60 మంది అసలు స్థలం, ఇళ్లు లేని లబ్దిదారులుగా తేలింది. వీరిలో మొదటి విడతగా ఇందిరమ్మ కమిటీ 26 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి అధికారుల పర్యవేక్షణ పంపగా అధికారులు సదరు లిస్టు ను ప్రదర్శించారు. దీంతో లిస్టు ను చూసిన గ్రామస్తులు అసలు ఇళ్లు కోసం దరఖాస్తులు చేయని 8 మంది



ఇళ్లు, భూములు ఉన్న ఆర్థిక బడాబాబులు పేర్లను ఎలా ఎంపిక చేస్తారంటూ కార్యదర్శి శ్రీనివాస్ ను నిలదీయగా తనకు తెలియదని 8 మంది పేర్లు ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపిక చేసారని చెప్పారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ శ్రీనివాస్ ను నిర్బంధించారు. ఏకంగా సుమారు రెండు గంటల పాటు నిర్బంధించటంతో విషయం తెలుసుకున్న సీఐ వడ్డేపల్లి మురళి తన సిబ్బంది ని పంపించారు. అనంతరం పోలీసులు జోక్యం తో సిబ్బంది తాళాలు పగలగొట్టి సెక్రటరీ శ్రీనివాస్ ను బయటకు తీసారు. అనంతరం సెక్రటరీ శ్రీనివాస్ ఎంపిడిఓ శ్రీదర్ స్వామి సదరు విషయం చెప్పగా ఆయన చరవాణి లో గ్రామస్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనర్హులను ఎంపిక చేయమని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. అదే విధంగా మండల పరిధిలోని పండ్రేగుపల్లి లో కూడా ఇందిరమ్మ కమిటీ సభ్యులు అనర్హులను ఎంపిక చేసారని తక్షణమే వారిని తొలగించాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు ఎంపిడిఓ కార్యాలయంలో వద్ద ఆందోళన నిర్వహించారు. అసలు ఇళ్లు లేని నిరుపేదలకు కాకుండా ఇళ్లు, భూములు, ఆర్థిక బడాబాబులు పేర్లను ఎంపిక చేసారని తక్షణమే వారిని తొలగించి తమకు న్యాయం చేయాలని లబ్దిదారులు కన్నీటి పర్యంతం అయ్యారు. దీంతో ఎంపీడీవో శ్రీధర్ స్వామి మాట్లాడుతూ మరల విచారణ చేసి అర్హులను ఎంపిక చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

# భూ భారతితోనే భూ సమస్యలకు మోక్షం

**ప్రజాపక్షం/కల్లూరు:** భూ భారతి తోనే భూ సమస్యలకు పరిష్కారం అని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. కల్లూరు లోని డివిన్పి ఫంక్షన్ హాల్ లో మంగళవారం జరిగిన భూభారతి అవగాహన సదస్సులో ఎమ్మెల్యే మట్టా రాగమయి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భూభారతిలో సవరించుకోవడానికి అన్ని అవకాశాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవిధంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలు, నాయకులను కోరారు. మండలంలో ఉచిత విద్యుత్ , బోనస్, ఉచిత బస్సు సౌకర్యం, ఇంటిగ్రేటెడ్ స్కూల్ బోనస్ లతోపాటు, కల్లూరుకు ఐటిఐ జూనియర్ కళాశాల లాంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భూభారతి చట్టం రైతులకు చుట్టం అంటూ ఆర్డీఓ రాజేంద్ర భూభారతి కీలక అంశాలు రికార్డులు, తప్పులు సవరణ, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, రిజిస్ట్రేషన్, మ్యూ ఛ్ వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ ఉత్తర మార్గాల ద్వారా వచ్చిన భూమికి సాదా




బైనామాల ద్వారా క్రమబద్ధీకరణ, పట్టాదార్ పాస్ పుస్తకాలు రివిజన్ అధికారాలు గ్రామ రికార్డులు రికార్డుల నకలు పొందడం ఎలా వీటన్నిటిపై ఆపిల్ వ్యవస్థ తదితర అంశాలపై ఆర్డిఓ రాజేంద్ర రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నీరజాదేవి, తహశీల్దార్ పులి సాంబశివుడు, ఎంపిఓ రంజిత్ కుమార్, పసుమర్తి చందర్రావు, రైతులు, అంగన్వాడి కార్యకర్తలు, ఐకెపి వివో ఏలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కమిటీలతో అధికారులకు తలనొప్పి..!




**-ఇందిరమ్మ కమిటీలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్యదర్శులు**
**-ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీలను నివారించాలి**

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేసుకుంటూ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో ప్రభుత్వం సఫలీకృతం అవుతుంది కానీ కొన్ని మండలాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకుల వల్ల ప్రభుత్వ లక్ష్యం ఆచరణ సాధ్యం కావట్లేదు పాలేరు నియోజకవర్గంలోని స్వయానా గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న తిరుమలాయపాలెం మండలంలో ఇందిరమ్మ కమిటీలలో గ్రూప్ తగాధలు పెట్టుకుని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో జాప్యం జరుగుతుంది. ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ పార్టీ నాయకుల తప్ప ఇతర పార్టీ నాయకులను తీసుకోలేదని గ్రామ పంచాయతీ కార్యదర్శులపై వివిధ పార్టీ నాయకులు ఒత్తిడి తెస్తున్నారు.తిరుమలాయపాలెం మండలంలో 40 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రజా పాలనలో ఇంటి నిర్మాణం కోసం 16.950 దరఖాస్తులు రాగా మొదటి విడతలో 729 ఇండ్లు మంజూరు కాగా పైలెట్ ప్రాజెక్టు క్రింద ఏలూవారిగూడెం గ్రామానికి 42 ఇండ్లు మంజూరయ్యాయి. దీనిలో అధికారులు ఇందిరమ్మ కమిటీల నిర్ణయానికి కట్టుబడి ఇల్లు మంజూరు చేస్తే తీవ్ర విమర్శలు వచ్చే అవకాశం ఉంది. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల్లో కేవలం కాంగ్రెస్ నాయకులు తప్ప ఇతర పార్టీల నాయకులు కమిటీల్లో లేరు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులను కాకుండా అనర్హులను ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీలను నివారించాలని గ్రామసభల ద్వారా బహిరంగ లబ్ధిదారుల ఎంపిక జరగాలని వివిధ పార్టీ నాయకులు ప్రజలు కోరుతున్నారు.

## తెలంగాణ రాష్ట్ర జూనియర్ కబడ్డీ జట్టుకు ఎంపికైన న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థి



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల28న జరిగిన తెలంగాణ రాష్ట్ర జూనియర్ బాలుర జట్టుకు జరిగిన ఎంపికలో న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థి ఎక్కిరాల వేణుఅభినయ్ తెలంఆణ రాష్ట్ర జూనియర్ కబడ్డీ జట్టుకు ఎంపికకావడం పట్ల కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం తరపున కర్ణాటక రాష్ట్రంలోని నాగపూర్లో అమెచ్యూర్ కబ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో కూడా చక్కని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీల్లో కూడా చక్కని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి జట్టుకు ఎంపిక కావాలని అన్నారు. అదేవిధంగా క్రీడలు అనేవి శారీరక ధృడత్వంతో పాటుగా మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, మా కళాశాలలో విద్యతో పాటుగా క్రీడలకు కూడా సమప్రాధాన్యతను కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్రావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ, ఏవో నర్సింహారావు పాల్గొన్నారు.

## రెండు కుట్టుమిషన్లు వితరణ




**ప్రజాపక్షం/వైరా:** గ్రేట్ విజన్క్లబ్ అధ్యక్షులు తోటకూర శ్రీకాంత్, వైరా లయన్స్క్లబ్ అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డిజెఎస్ లయన్ లగడపాటి ప్రభాకర్ రావు పుట్టినరోజు సందర్భంగా వైఆరకి చెందిన వేముల వెంకటలక్ష్మి, పతంగి మౌనికకు కుట్టుమిషన్లు అందించారు. అనంరం కేక్ కట్చేశారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ కుట్టుమిషన్లు అందించడం ద్వారా మహిళలకు జీవనోపాధి కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎస్టి కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్బాబు, జెడ్సి వుంద్రు వరలక్ష్మి , గంగవరపు కిషన్, సెక్రటరీ జాలా పుల్లారావు, ట్రెజరర్ వుయ్యూరు రామకృష్ణ, మర్రికంటి రాంగోపాల్, చింతోజు నాగేశ్వరరావు, చెరుకూరి శ్రీను, మచ్చా రామారావు, ఏపూరి రాజారావు, కె.గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు జరిగే ఐక్య బహిరంగ సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/బోనకల్:** ఈద్ మిలాప్, వక్ఫ్ సవరణ చట్టం వ్యతిరేకంగా తెలంగాణ ముస్లీం ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30న మధిర నిర్వహించే ఛలో మధిరఐక్య బహిరంగ సభను విజయవంతం చేయాలని సంఘం కేంద్ర కమిటి సభ్యులు షేక్ జాని మియా పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ వక్ఫ్ బిల్లు సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగ విలువలను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా సవరణ చట్టం తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. రాజ్యాంగాన్ని, ముస్లీం మైనార్టీ హక్కులను, మత స్వేచ్ఛను హరిస్తున్న వక్ఫ్ బిల్లుపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్న కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యధోరణిలో వ్యహరించడం సమజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈద్ మిలాప్, వక్ఫ్ బిల్లు సవరణ చట్టం జరిగే ఐక్య బహిరంగ సభకు జాతీయ, రాష్ట్ర, జిల్లా ముస్లీం నాయకులు పాల్గొని ప్రసంగించనున్నారని తెలిపారు. పెద్ద ఎత్తున్న ముస్లీం సోదరులు ఈ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఆందోళనలు ఉధృతం చేస్తాం

**పార్ట్టైమ్..కాంట్రాక్ట్ అధ్యాపకుల పిలుపు**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం దొడ్డిదారిన తెచ్చిన జిఓ నంబర్ 21ను ఉపసంహరించుకునేంత వరకు తమ ఆందోళనలను నిలువరించలేదని మరింత ఉధృతం చేస్తామని స్థానిక కాకతీయ యూనివర్శిటీ పిజి, ఫిజికల్ ఎడ్యూకేషన్ కళాశాలల కాంట్రాక్ట్, పార్ట్టైమ్ అధ్యాపకులు అంటున్నారు. ప్రభుత్వ వైకరిని నిరసిస్తూ చెపట్టిన నిరవదిక నిరసన దీక్ష మంగళవారం 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అధ్యాపకులు డాక్టర్ టి.గోపి, ఎం.శ్యాంబాబు, ఎ వీరన్న, ఎన్ రవిబాబు మాట్లాడారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను ప్రభుత్వం శాశ్వత ప్రతిపదికన క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించకుండా జిఓ నెంబర్ 21ను తెచ్చి తమ జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చిందన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులకు పే స్కేల్, హెచ్ఆర్, డిఏ, మూడు ఇంక్రిమెంట్లతో కూడిన ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా పార్ట్ టైం అధ్యాపకులను కాంట్రాక్ట్ అధ్యాపకులుగా అప్గ్రెడ్ చేయాలన్నారు. దీనిపై ఇప్పటికే ఛలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించి సెక్రటరియెట్ ముట్టడిని విజయవంతంగా చేపట్టామన్నారు. ప్రజాప్రతినిధులు, పాలకులను కలిసి సమస్యలను పరిష్కరించాలని విన్నవించినట్లు తెలిపారు. ఈ దీక్షలో అధ్యాపకులు డాక్టర్ పేరెల్లి కోటి, వీరాంజనేయులు, జగజ్జీవన్రావు, పి.శ్రీనివాస్, జి.రమ, వనం లక్ష్మి హరిత, నర్సింహనాయక్ పాల్గొన్నారు.

# జూలూరుపాడులో ఘోర రోడ్డు ప్రమాదం

**-ఎదురెదురుగా రెండు కార్లు ఢీ..**
**-ఆరుగురికి గాయాలు.. ఒకరి మృతి**
**-వీరిలో ముగ్గురు సౌత్ కొరియా టూరిస్ట్‌లు**





**ప్రజాపక్షం/జూలూరుపాడు:** రెండు కార్లు ఎదురెదురుగా అతి వేగంతో ఢీకొని ఆరుగురికి గాయాలు కాగా ఒకరు మృతి చెందిన ఘటన మంగళవారం ఉదయం జూలూరుపాడు మండలంలో చోటు చేసుకుంది. సౌత్ కొరియా నుండి ఇండియా పర్యటనలో భాగంగా భద్రాచలం పరిసర ప్రాంతాలు సందర్శించేందుకు ముగ్గురు సౌత్ కొరియా వాసులు ఒక గైడును వెంట బెట్టుకొని కారులో భద్రాచలం కు బయలుదేరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలానికి చెందిన వానపాకుల సాంబశివరావు హైదరాబాద్‌లో డ్రైవర్ గా పని చేస్తూ, నాలుగు రోజుల క్రితం బూర్గంపాడు మండలంలోని వేలేరు గ్రామంలోని బంధువుల ఇంట శుభకార్యానికి వచ్చాడు. అనంతరం తన భార్య శ్రీలత , మరదలు సంధ్య లతో కలిసి కారులో హైదరాబాద్ బయలుదేరాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సరిహద్దు గ్రామమైన వినోబా నగర్ సమీపంలో రెండు కార్లు అతి వేగంతో ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. దీంతో రెండు కార్లు నుజ్జు నుజ్జు అయ్యాయి. రెండు కార్లలో ప్రయాణిస్తున్న ఏడుగురికి గాయాలవగా వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీస్‌లు అందించిన సమాచారం మేరకు 108 వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుండి గాయపడిన సౌత్ కొరియా వాసులు ఖమ్మంలోని సురక్ష హాస్పిటల్ లో తక్షణ వైద్యం పొందుతుండగా, తీవ్రంగా గాయపడిన వానపాకుల సాంబశివరావు కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పని దినాలు తగ్గింపుపై పార్లమెంట్‌లో మాట్లాడండి

**ఎంపీ రఘురాం రెడ్డికి వినతి**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జాతీయ ఉపాధి హామీ పథకంలో తెలంగాణ రాష్ట్రానికి ప్రతి సంవత్సరం ఇవ్వాల్సిన రూ.12 కోట్ల పని దినాలకు బదులు, కేవలం రూ.6.5 కోట్ల పని దినాలు ఇచ్చి కూలీలకు పనులు లేకుండా చేసే కుట్రకు పాల్పడుతున్న మోడీ ప్రభుత్వ విధానంపై పార్లమెంట్‌లో మాట్లాడి ఉపాధి కూలీలకు పనులు కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంఈ వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డికి వినతి పత్రం అందజేశారు.మంగళవారం జరిగిన సమావేశంలో దండు ఆదినారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కూలీలు ఎప్పుడడిగితే, అప్పుడు పని కల్పించాల్సి ఉండగా అట్టి విధానాన్ని తీసేసి కేవలం తెలంగాణ రాష్ట్రంలో రూ.6.5 కోట్ల పని దినాలు ఇచ్చి కేంద్ర ప్రభుత్వం జీఓలు జారీ చేయడం దుర్మార్గమైన చర్యని మండిపడ్డారు.ప్రతి సంవత్సరం రూ.12 కోట్లు పైగా కూలీలు పని చేస్తుంటే ఈ సంవత్సరం కేవలం 6 కోట్ల మందికి, సగానికి సగం తగ్గించి కూలీలను ఇబ్బంది పెట్టే క్రమంలో పని దినాలు కేటాయించడం జరిగిందని దండు తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం యూపీఏ ప్రభుత్వం కమ్యూనిస్టుల సహకారంతో వలసలు నివారించడానికి తీసుకొచ్చిన చట్టాన్ని మోడీ బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసి కూలీల పొట్ట కొట్టి డబ్బులను కార్పోరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నం చేస్తుందని, చట్టం ప్రారంభంలో రూ.1,50,000 కోట్ల నిధులు కేటాయించిన ప్రభుత్వం, గత సంవత్సరం కేవలం రూ.80,000 కోట్లు కేటాయించిందని ఈ సంవత్సరం కూడా బడ్జెట్‌లో రూ. 80 వేల కోట్లు కేటాయించిందని దీని వలన కూలీలకు పనులు లేక పస్తులతో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఎంపీ రఘురామిరెడ్డికి వివరించారు. ఈ విషయమై పార్లమెంట్ లో చర్చించి కూలీలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సత్తుపల్లి వచ్చిన ఎంపీకి విజ్ఞప్తి చేశారు.

## కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్‌లో ఉద్యోగుల రాకపోకలపై ఆంక్షలు ఎత్తివేయాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కార్మికుల గుండెకాయ ఉద్యోగులకు దేవాలయం లాంటి హెడ్ ఆఫీస్ లో కార్మికుల రాకపోకలపై ఆంక్షలు ఎత్తివేయాలని కోరుతూ మణుగూరు కు చెందిన సామాజిక సేవకులు కర్నే బాబురావు మంగళవారం కొత్తగూడెం హెడ్ ఆఫీస్ లో డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్, ఇన్చార్జి డైరెక్టర్ పా కొప్పుల వెంకటేశ్వర్లు కి ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు కర్నే బాబురావు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులకు దేవాలయాలు, ముస్లింలకు మసీదులు, క్రైస్తవులకు చర్చిలు, సిక్కులకు స్వర్ణ దేవాలయం ఎంతనో సింగరేణి ఉద్యోగులకు వారి హృదయాలలో కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ కు అంతటి గొప్ప స్థానం అంతటి భక్తి భావం ఉన్నదనీ, తమ కష్టాలు చెప్పుకోవడం కోసం ఆలయానికి మందిరాలకు భక్తులు ఎలా వెళతారో తమ సమస్యలు చెప్పుకోవడం కోసం కూడా హెడ్ ఆఫీస్ కి ఉద్యోగులు అలా వస్తారు. కానీ కొత్తగూడెం హెడ్ ఆఫీస్ లో ఉద్యోగుల రాకపోకలపై సెక్యూరిటీ విభాగం అమలు చేస్తున్న ఆంక్షలు కార్మికుల ఉద్యోగుల ఆగ్రహానికి, ఆవేదనకు కారణభూతం అవుతున్నాయన్నారు. మాజీ కార్మికులను, కార్మిక నాయకులను అయితే మరి చిన్న చూపు చూస్తున్న పరిస్థితి వారు ఏదైనా వినతి పత్రం అందజేయాలని హెడ్ ఆఫీస్ కు వస్తే వారి పట్ల సెక్యూరిటీ విభాగం వారు అనుచితంగా ప్రవర్తించడమే కాక ఆంక్షల పేరుపై వారితోపాటు ఒక కెమెరా సెల్ తో సెక్యూరిటీ గార్డును వెంట పంపడం చివరికి బాత్రూంకి వెళ్దాం అన్నా తప్పని ఇబ్బంది పురాణాలలో హరిశ్చంద్రుని వెనుక నక్షత్రకుడి పాత్రను గుర్తు చేస్తున్నారనీ ఆయన ఆవేదన చేశారు. బలరాం ఎండి అయిన తర్వాత పరిస్థితిలో మార్పు వస్తుందని ఉద్యోగులందరు భావించారనీ, హైదరాబాద్ ప్రజాభవన్ లో మార్పులాగా సింగరేణి భవన్, హెడ్ ఆఫీస్ లో కూడా కొంత మార్పు కనిపించిన మాట వాస్తవం ఎందుకో కానీ అంతే వేగంగా మరలా నిబంధనలు ఆంక్షలు మరింత కఠిన తరం చేస్తున్నారన్నారు. పరిస్థితిలో మార్పు రాకపోతే హైదరాబాద్ ఎండి ని కూడా కలిసి హెడ్ ఆఫీస్ ఆంక్షలు పై వారి దృష్టికి తీసుకువెళతానని కర్నే బాబురావు విలేకరులకు తెలిపారు.

# పహల్గాం ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ నిరసన ర్యాలీ

**ప్రజాపక్షం/ మధిర :** కాశ్మీర్‌లోని పహల్గాంలో భారతీయ యాత్రికులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ టివిఎం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో క్లబ్ సభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గాం ఉగ్రవాదుల దాడిలో 27మంది అమాయక భారతీయ పర్యాటకులు బలికావటం అత్యంత బాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ఉగ్రవాదుల దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. ఈ



కార్యక్రమంలో మధిర టివిఎం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు లింగంపల్లి వెంకాయమ్మ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఆదివాసీ గ్రామాల్లో ఫీవర్ సర్వే



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు పరిధిలో గల ప్రాబ్ ఆదివాసి గిరిజన గ్రామమైన విప్పల గుంపు, కొత్తూరు లో మంగళవారం (ఎటువంటి లక్షణాలు లేకుండా మలేరియా కలిగి ఉండుట) ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని సందర్శించి 125 మందికి రక్త పరీక్షలు జరుపగా ఎవరికి కూడాను మలేరియా సోకలేదని నిర్ధారణ అయినట్లు హెల్త్ అసిస్టెంట్స్ రాంప్రసాద్ తెలిపారు. అదే విధంగా ఇంకనూ ఖమ్మం తోగు, బుడుగుల గ్రామాలలో ఈ ఫీవర్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్ కృష్ణ, కౌసల్య, ఆశా కార్యకర్తలు పద్మ, నాగమణి, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** మే 15 నుండి 18 వరకు తిరుపతి, ఆంధ్రప్రదేశ్ లో జరిగే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని మంగళవారం నాడు కొత్తగూడెం శేషగిరి భవన్ లో గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ ను అమలు చేయాలని ,ప్రభుత్వ పబ్లిక్ సెక్టార్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని, దేశవ్యాప్తంగా ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని ,2020 నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. యువజన హక్కుల కోసం యువత మార్పు కోసం యువత పనిచేయాలని మే 15 చలో తిరుపతి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ఖయ్యూం, ఏఐవైఎఫ్ నాయకులు ఎస్.కె రసూల్, చంద్రగిరి ప్రసాద్ రావు, షేక్ ఖాసీం,కోడూరు నాగేష్, భూక్య గణేష్, తమ్మిశెట్టి వంశీ, నల్లబాల విజయ్ రాజ్, ఎస్కే జమీర్ భాష, ఎస్.కె సమీర్, నాగరాజు, షేక్ మదర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏరియాలో స్ట్రక్చర్ కమిటీ సమావేశం



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** మంగళవారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు గుర్తింపు ప్రాతినిధ్య సంఘం సభ్యులతో స్ట్రక్చర్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుర్తింపు ప్రాతినిధ్య సంఘం యొక్క స్ట్రక్చర్ కమిటీ సభ్యులు అందజేసిన డిమాండ్లను జిఎం కమిటీ సమావేశంలో హాజరైనటువంటి సంబంధిత అధికారులతో చర్చించి వారి డిమాండ్ల యొక్క అమలుకు సాధ్య సాధ్యలను పరిశీలించి ఏరియా పరిధిలో పరిష్కరించదగిన డిమాండ్లను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ తో ఏర్పాటు చేసిన స్ట్రక్చర్ కమిటీ నందు కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ సెక్రటరీ వి. మల్లికార్జున రావు, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జె.గట్టయ్య, సత్తుపల్లి ఏరియా ప్రతినిధి సముద్రాల సుధాకర్ ప్రాతినిధ్య సంఘం ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ టి.నాగరాజు, స్ట్రక్చర్ కమిటీ మెంబర్ కే.సమ్మయ్య యాజమాన్య ప్రతినిధులుగా ఎస్ఓటు జిఎం జివి.కోటిరెడ్డి, , ఎజిఎం సివిల్ సిహెచ్. రామకృష్ణ, ఏజెంట్ పద్మావతి ఖని బి.రవీందర్, డీజీఎం పర్సనల్ బి.శివకేశవరావు, జీకే ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.రమేష్, కిష్టారం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.వి.నరసింహారావు, డిజిఎం ఐఈడి ఎన్.యోహన్, డిజిఎం ఈ ఎం ఏరియా వర్క్ షాప్ టి.శ్రీకాంత్, ఏరియా స్టోర్స్ ఇంచార్జ్ లక్షణమూర్తి, ఐటి మేనేజర్ కే. శేష ఇంచార్జ్ ఆర్.సి.హెచ్.పి ఎస్.కే.కరీముల్లా, సీనియర్ పిఓలు మజ్జి మురళి పాల్గొన్నారు.

# మండలంలో పశు వైద్య శిబిరాలు



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మండల పరిధిలోని రాయపట్నం, రొంపిమళ్ళ గ్రామాల్లో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. అనంతరం పశు వైద్య సహాయ సిబ్బంది రైతులకు లేగ దూడల సంరక్షణపై అవగాహన కల్పించారు. పుట్టిన లేగ దూడలకు మొదటి మూడు రోజులు ముర్రుపాలు తాగిస్తే దూడలు త్వరగా పెరిగి రోగ నిరోధక శక్తి కలిగి ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. దూడల్లో ఎక్కువ నీళ్ల విరోచనాలు ద్వారా నీరసించి శరీరంలో రీహైడ్రేషన్ కలగటం వల్ల మరణాలు సంభవిస్తాయని , వేసవిలో నీళ్లు అందుబాటులో ఉంచి నీడలో చెట్ల కింద కట్టివేయాలని పశుపోషకులకు తెలిపారు. ఈ శిబిరంలో ఎల్‌ఎస్ఎలు రఫీఅహ్మద్, లక్ష్మణ్‌రావు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్స్ కొండలరావు, కిరణ్, గోపాల మిత్రులు, పాడి రైతులు పాల్గొన్నారు.

# అపర భగీరథుడు మంత్రి తుమ్మల

-నెరవేరిన దశాబ్దాల కల

-ముఖ్యమంత్రి, మంత్రి చిత్ర పటాలకు పాలాభిషేకం





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** దశాబ్దాల కలను నెరవేర్చిన అపర భగీరథుడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అని మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్ తెలిపారు. ఎన్నో ఏళ్లుగా రఘునాథపాలెం మండల రైతులకు సాగునీటి కలను సాకారం చేశారని ఆయన తెలిపారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా రఘునాథపాలెం మండలంలోని 33 చెరువులను కృష్ణా జలాలను నింపి 2500 ఎకరాలకు సాగునీటిని అందించేందుకు నిర్మించిన లిఫ్ట్ ట్రయల్ రన్ విజయవంగా పూర్తయిన సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని బావోజీతండా సమీపంలో గల రేగులకుంట చెరువు వద్ద రైతులతో కలిసి మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించి చెరువులో పుష్పాలు చల్లి సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ మండల కమిటీ కన్వీనర్ వాంకుడోత్ దీప్లా నాయక్ ఆధ్వర్యంలో జరిగిన సభలో మానుకొండ రాధాకిషోర్ మాట్లాడుతూ.. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రఘునాథపాలెం మండలానికి సాగునీటిని అందించేందుకు బుగ్గవాగు ప్రాజెక్టుకు అప్పటి ఎంఎల్ఎ, ఇప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శ్రీకారం చుట్టారని కానీ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అది నెరవేరలేదన్నారు. దశాబ్దాలుగా రఘునాథపాలెం మండల రైతులు, ప్రజలు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారని ఆయన తెలిపారు. గత ఎన్నికల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇచ్చిన హామీ మేరకు వి. వెంకటాయపాలెం సాగర్ కాలువ నుంచి రఘునాథపాలెం మండలానికి సాగునీటిని అందించేందుకు మంచుకొండ ఎత్తిపోతల పథకానికి రూ. 66 కోట్ల నిధులు కేటాయించారన్నారు. పనులు ప్రారంభించిన మూడు నెలల్లోనే పూర్తి చేసి చెరువులకు నీటిని నింపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతుల కల సాకారం చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మండల రైతులు, ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. 2009లో ఎంఎల్ఏగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు అర్బన్ మండలంగా ఉన్న రఘునాథపాలెం అభివృద్ధి చెందాలంటే కొత్త మండలంగా రూపాంతరం చెందాలని ఆ దిశగా కృషి చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేస్తుందని ఆయన తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తుందని అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీతో పాటు రైతు భరోసా అందించిందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ మంత్రిగా రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. సాంప్రదాయ పంటలు కాకుండా రైతులకు లాభం చేకూర్చే పంటల వైపు దృష్టి సారించాలని కోరుతున్నారన్నారు. జిల్లాలో పామాయిల్ సాగు చేయాలని రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారన్నారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాను సస్య శ్యామలం చేయడమే మంత్రి తుమ్మల లక్ష్యమని అందుకు తన వంతు కృషి చేస్తున్నారన్నారు. వేంసూరు ఎత్తిపోతల పథకంతో పాటు పాలేరు నియోజక వర్గానికి సంబంధించి భక్తరామదాసు ప్రాజెక్టు నిర్మించిన ఘనత మంత్రి తుమ్మలదన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేయడమే మంత్రి తుమ్మల ఏకైక లక్ష్యమన్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, మండల బాధ్యులు రెంటాల ప్రసాద్, దేవ్‌సింగ్, బండి వెంకన్న, తమ్మిని నాగేశ్వరరావు, దరావత్ రామ్మూర్తి, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మాజీ ఎంపిపి భూక్యా గౌరి, వాంకుడోత్ విజయ, తారాదేవి, మాలోత్ లక్ష్మి , మంగీలాల్, పలువురు మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు బిజెపి నేతలు క్షేత్రస్థాయిలో సన్నద్ధం కావాలని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గుత్తా వెంకటేశ్వర్లు తెలిపారు. బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు సూచనల మేరకు మంగళవారం బిజెపి నాయకులు రఘునాథపాలెం మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి పోలింగ్ కేంద్రాల అధ్యక్షులను కలిసి సంస్థాగత పార్టీ విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు గుత్తా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ప్రతి బూత్‌లో పార్టీ అభ్యర్థిని నిలబెట్టాలని ఎన్నికలకు సంస్థాగతంగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గుత్తా వంశీ, మండల ఇంచార్జ్ మందడపు ప్రభాకర్‌రెడ్డి, బాలాజీ, కేతినేని రవి, కోటేరు మోహన్‌రెడ్డి, రాంబాబు, నాగేశ్వరరావు, నరేష్, శంకర్, రవి, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రదాడి మృతులకు నివాళి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జమ్ము కశ్మీర్‌లోని పెహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందిన మృతులకు ప్రభుత్వ వైద్య కళాశాలలో నివాళులర్పించారు. మంగళవారం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో అధ్యాపకులు, సిబ్బంది కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులర్పించారు. జమ్ము కశ్మీర్‌లో పర్యటనకు వెళ్లిన ప్రజలపై ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాజేశ్వరరావు తెలిపారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంతాపం తెలపడంతో పాటు మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు.

# మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

-అఖిల పక్ష కార్మిక సంఘాల సంయుక్త సమావేశం పిలుపు





**ప్రజాపక్షం/ఖమ్మం :** దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని ఈ చర్యను నిరసిస్తూ మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ప్రజలకు అఖిల పక్షకార్మిక సంఘాల సంయుక్త సమావేశం పిలుపునిచ్చింది. మంచికంటి భవన్‌లో అఖిలపక్ష కార్మిక సంఘాల జిల్లా స్థాయి సంయుక్త సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జే. వెంకటేష్, టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సూర్యం, ఐఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు పాల్వంచ కృష్ణ, ఐఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కె. రాంసింగ్‌లు హాజరయ్యారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ కార్మికులకు సంబంధించి ఏ చట్టాన్ని కార్మికుల పట్ల అభిమానంతోనో, వారి బాధలు గమనించో ఏ ప్రభుత్వం చేయలేదని భారతదేశ కార్మిక వర్గం అనుభవిస్తున్న ప్రతి హక్కు వెనక దశాబ్దాల పోరాటం దాగి ఉందన్నారు. అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాసేందుకు సిద్ధమైందన్నారు. మోడీ యాజమాన్యాల లేదా శ్రమ దోపిడీదారుల పక్షాన పని చేస్తున్నారని కార్మిక సంఘాల నేతలు ఆరోపించారు. కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయకుండా ఉన్న చట్టాలను తొలగించి కార్మికులకు పని భద్రత లేకుండా చేస్తున్నారని వారు ఆరోపించారు. దశాబ్ద కాలంలో మోడీ ప్రభుత్వం సంఘటిత అసంఘటిత కార్మికుల కొరకు ఖర్చు చేసిన మొత్తం లక్ష కోట్లు కూడా లేదని కాని కార్పొరేట్ సంస్థల కోసం రూ. 16.53 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారని వారు తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పెరిగిన ధరలు, జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని కనీస వేతనాన్ని పెంచాల్సింది పోయి తగ్గించిందన్నారు. రోజుకు రూ. 70లకు కనీస వేతనాన్ని కుదించడం కార్మికుల పట్ల కక్ష సాధింపు చర్యగా వారు అభివర్ణించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా జరిగే ఈ సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు మద్దతునివ్వాలని సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశానికి ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, నరాల నరేష్ నాయుడు (ఐఎన్‌టియుసి), విష్ణువర్ధన్ (సిఐటియు). ఎ. వెంకటరెడ్డి, ఐ. వెంకన్న అధ్యక్షత వహించగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, సిఐటియు కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, టియుసిఐ జిల్లా కార్యదర్శి జి. రామయ్య, ఐఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు నీలం రాజేష్, ఐఎఫ్‌టియు నాయకులు గుగులోత్ పటేల్ పాల్గొన్నారు.

# సెంట్రల్ లైటింగ్‌ని పునరుద్ధరించాలి



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు లోని సెంట్ర ల్ లైటింగ్ ని పునరుద్ధరించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆశాలత పంచాయతీ ఈవోకు మంగళవారం ఆదేశించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు కల్లూరు పట్టణంలో కొన్ని సంవత్సరాలుగా సెంట్రల్ లైటింగ్ వెలగక ప్రజల ఇబ్బందులు పడుతున్నట్లు మేజర్ పంచాయతీ ప్రజలు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు తెలియపరచడంతో మంగళవారం కల్లూరు లోని సెంట్రల్ లైటింగ్‌ను పరిశీలిస్తూ స్తంభాలకు ఉన్న పోస్టర్లు ఫ్లెక్సీలు రాజకీయ పార్టీల జెండాలు తీసివేయాలని సెంట్రల్ దిమ్మెలకు రంగులు వేయాలని పంచాయతీ నాగేశ్వరరావుకు ఆదేశించారు. అదేవిధంగా హనుమ తండా నూతన పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్మికుడు మృతి



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్న గుండ్ర వీరస్వామి (54) మంగళవారం ఉదయం తిరువూరు నుంచి తన ద్విచక్ర వాహనంపై కల్లూరు వైపు వస్తుండగా ముగ్గు వెంకటాపురం వద్ద కోతులు అడ్డు రావడంతో ప్రమాదవశాత్తు పడిపోవడంతో బలమైన గాయాలు తగలడం వల్ల ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీస్‌లు తెలిపారు. అతనికి భార్య జమలమ్మ, పిల్లలు ఉన్నారు. కల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిత తెలిపారు. పలువురు ప్రముఖులు ఆయన భౌతిక దేహమును సందర్శించి. సంతాపాన్ని. ప్రగాఢ సానుభూతిని తెలిపి నివాళులర్పించారు.

# అటవీ శాఖలో అవినీతి ఊట

**-డివిజన్ ఆఫీస్‌లో తిష్ట వేసిన సారు**
**-ముడుపులిస్తేనే బిల్లులు**
**-అంతా ఆయన కనుసన్నల్లోనే ...**




**ప్రజాపక్షం/ఖమ్మం/మణుగూరు:** అటవీ శాఖలో కొంత మంది అధికారులు ఊడలు దిగిన మర్రుల్లా కార్యాలయాల నుంచి కదిలే పరిస్థితి లేదు. దశాబ్దాల తరబడి ఒకే చోట పాతుకుపోయి కంచె చేను మేస్తున్న చందంగా అటవీ శాఖను భ్రష్టు పట్టిస్తున్నారు. వీరి తీరుతో అటవీ శాఖలో అవినీతి ఊట రోజు రోజుకు పెరిగిపోతుంది. ముడుపులిస్తేనే బిల్లులు ముడతాయంటూ హెచ్చరించడమే కాకుండా అంతా నా కనుసన్నల్లోనే ఉంటుంది. జిల్లా అధికారులైనా మరెవరైనా నా మాట వినాల్సిందే నంటూ ఆ అటవీ అధికారి చెబుతుండటంతో ఈ డివిజన్ పరిధిలో ఉద్యోగులు లబోదిబోమంటున్నారు. సారుకు ఫోన్ చేస్తే ఏమంటారోనని ఉద్యోగులు వణికిపోతున్నారు అవినీతి నిరోధక శాఖాధికారులు ఈ అధికారిపై దృష్టి సారించాల్సి ఉంది. మణుగూరు డివిజన్‌లో అటవీ శాఖాధికారిగా పనిచేస్తున్న ఈయన సాటి ఉద్యోగులు కమిషన్లు ఇస్తే తప్ప బిల్లులు చెల్లించే పరిస్థితి లేదు. మణుగూరు డివిజన్ పరిధిలోని అటవీ శాఖలోని వివిధ సెక్షన్లలో పనిచేసిన ఉద్యోగులు బిల్లుల కోసం డివిజనల్ అధికారిని ఆశ్రయిస్తే ముడుపులు ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారని వాపోతున్నారు. ఉద్యోగులు బయటకు చెప్పుకోలేక, బిల్లులు రాక సతమతమవుతున్నారు. అటవీ శాఖలో వన్య ప్రాణుల సంరక్షణ, అడవిని రక్షించేందుకు అనేక పనులు వివిధ సెక్షన్లలో జరుగుతుంటాయి. ఆ పనులు సక్రమంగా చేసిన కమిషన్ల కోసం బిల్లులను చెల్లించడం లేదని ఆ డివిజన్ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బిల్లుల చెల్లింపులో కమిషన్ కోసం ఇబ్బందులు పెడుతున్న ఈ అధికారిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


## అక్రిడేషన్ల సమస్యకు త్వరలో పరిష్కారం

**-ఐజెయు నేతలతో మంత్రి పొంగులేటి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడేషన్ల సమస్యకు త్వరలో పరిష్కారం చూపుతామని రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై మంగళవారం ఖమ్మంజిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంత్రికి వినతి పత్రాన్ని సమర్పించారు. అక్రిడేషన్ల గడువు ముగిసి చాలా కాలమైన కొత్త అక్రిడేషన్లు మంజూరు చేయలేదని హెల్త్ కార్డులు పని చేయడం లేదని ఇతర జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు. దీనికి స్పందించిన మంత్రి పొంగులేటి కొత్త అక్రిడేషన్ల జారీపై మార్గదర్శకాలను తయారు చేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశామని ఆ కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, హెల్త్ కార్డు, ఇండ్ల స్థలాలు ఇతర త్రా సమస్యలపై త్వరలో జర్నలిస్టు సంఘాలతో సమావేశమవుతామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజె (ఐజెయు)రాష్ట్ర కార్యదర్శి కె. రాంనారాయణ మాట్లాడుతూ గడిచిన పదేళ్ల కాలంలో జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాలు సరిగ్గా అమలు జరగ లేదని స్టేట్ లెవల్ అక్రిడేషన్ కమిటీ తెలంగాణ జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్ వేజ్ బోర్డు సిఫారసు అమలుకు సంబంధించి త్రైపాక్షిక కమిటీ ఏర్పాటు చేయాలని జర్నలిస్టులపై దాడులకు సంబంధించి ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె మోహిసుద్దీన్, సీనియర్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు నలజాల వెంకట్రావు, మామిడాల భూపాల్, జనార్ధనచారి, పసుపులేటి సత్యనారాయణ, నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్, నాయకులు వేణుగోపాల్, మేడి రమేష్, కళ్యాణ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ..జాగ్రత్తలు.. నివారణలు..!



**ప్రజాపక్షం/మణుగూరు:** ఎండాకాలం అనేది ఆరోగ్యపరంగా సవాళ్ళతో కూడిన కాలం. సరైన జాగ్రత్తలు తీసుకుంటే మనం ఈ వేడి కాలాన్ని సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదుర్కొనవచ్చు. తగిన ఆహారం, నీరు, విశ్రాంతి, చల్లదనా పూరిత జీవనశైలితో ఈ కాలాన్ని ఆనందంగా గడపవచ్చు. వృద్ధులు, పిల్లలు, గర్భిణీలు మరింత శ్రద్ధ వహించాలి. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న మాటని ఎప్పుడు గుర్తుంచుకోవాలి. ఎండాకాలంలో దాహం, నీరసం, వేడి, కాళ్ల డిహైడ్రేషన్ తదితర సమస్యలు ఎక్కువగా ఉంటాయి. ఈ సమయంలో శరీర ఉష్ణోగ్రత పెరిగి, ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ సీజన్లో ఈ సమస్యలను తట్టుకోవాలంటే కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు పాటించాలి..

ఎక్కువగా నీరు తాగటం...
రోజుకు కనీసం మూడు నుండి నాలుగు లీటర్ల నీరు తాగాలి. శరీరంలో నీటి సంయుక్త నిలబెట్టడానికి ఇది అవసరం. కొబ్బరి, నీరు, బియ్యం, నీరు డిహైడ్రేషన్ నివారించడంలో కీలకము. గొంతు ఎండకుండా ఉండేందుకు తరచూ మంచినీరు తాగుతూ ఉండాలి.. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు వేడి ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం చాలా మంచిది. తప్పనిసరి వెళ్ళవలసి వస్తే గొడుగు ధరించి, కండ్లకు చలువ కండ్ల అద్దాలు పెట్టుకుని వెళ్ళటం మంచిది..

తేలికపాటి దుస్తులు ధరించటం..
పొడిగాలి త్వరగా శరీర ఉష్ణోగ్రత పెరగకుండా ఉండేందుకు కాటన్ దుస్తులు బాగా ఉపయోగపడతాయి. బౌలర్ రంగు లేదా గాఢమైన దుస్తులు వేడిని ఎక్కువగా ఇస్తాయి. కాబట్టి తెలుపు, లైట్ కలర్స్ దుస్తులు ధరించటం ఉత్తమం...

చల్లదనం ఇచ్చే ఆహారం తీసుకోవాలి..
వెల్లుల్లి పెరుగు తాటి ముంజలు వంటి పదార్థాలు శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. వీటిలో నీటి శాతం అధికంగా ఉండటం ఉన్న వేడి తగ్గుతుంది. బాహ్య ఉష్ణోగ్రతల ప్రభావాన్ని తగ్గించేందుకు ఇవి సహాయపడతాయి. వేసవిలో ప్రతి రోజు తీసుకునే ఆహారంలో ఉండలా చూసుకోవాలి..

మసాలా మరియు జంక్ ఫుడ్ మానేయండి.....
వేసవికాలంలో ఎక్కువగా మసాలా వంటకాలు చిప్స్ తినటం వలన జీర్ణ క్రియ మందగిస్తుంది. ఇవి సెరియా ఉష్ణోగ్రతను పెంచుతాయి కాబట్టి సులభంగా జీతం అయ్యే పెరుగన్నం లాంటివి తీసుకోవటం చాలా ఉత్తమం..

ఆహారాన్ని మానివేయవద్దు..
ఎండాకాలంలో ఆకలి లేకపోవడం సాధారణమైన విషయం. సమయానికి ఆహారం తినాలి. శరీరంలో ఎనర్జీ తగ్గకుండా ఉండేందుకు ఆహారం, ప్రోటీన్స్, మినరల్స్, కార్బోహైడ్ లో ఉన్న ఆహారాన్ని తీసుకుని తీసుకొని బలహీనత నీరసం నుండి కాపాడుకోవాలి. వేడి అధికంగా ఉండే సమయంలో శరీరానికి విశ్రాంతి అవసరం సుమారు 15 నుంచి 30 నిమిషాల మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటే శరీరం చల్లబడి మళ్లీ శక్తిని అందిస్తుంది. ఇంటి చుట్టూ చల్లదనం ఉండేలా చూసుకోవాలి. ఇంట్లో వేడిగాలి తగ్గించేందుకు కట్టనులు వాడాలి. తడి గుడ్డలు తలుపులపై ఉంచితే చల్లదనం పెరుగుతుంది.

ఆరోగ్యం ఎండాకాలం జాగ్రత్తలు....
ఎండాకాలంలో దాహం, నీరసం, వేడిగాలులు, డీహైడ్రేషన్ వంటి సమస్యలు ఎక్కువగా ఉంటాయి. ఈ సమయంలో శరీర ఉష్ణోగ్రత పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముంది. సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఈ సీజన్‌ను ఆరోగ్యంగా తట్టుకోవచ్చు. ఇప్పుడు 15 ముఖ్యమైన ఎండాకాల జాగ్రత్తలను పరిశీలిద్దాం.

1. ఎక్కువగా నీరు త్రాగండి...
రోజుకు కనీసం 3 లీటర్ల నీరు తాగాలి. శరీరంలో నీటి సమతుల్యం నిలబెట్టడానికి ఇది అవసరం. చిలిపి నీరు, కొబ్బరి నీరు, బుట్టల బియ్యం నీళ్లు మంచివి. డీహైడ్రేషన్ నివారించడంలో ఇది కీలకం. గొంతు ఎండకుండా ఉండేందుకు తరచూ తాగాలి.

2.పొడవుగా ఎండలో ఉండకండి..
ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు వేడి ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో బయటకు వెళ్లకూడదు. ఎండల వల్ల హీట్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. అత్యవసరమైతే చాప, టోపీ, కళ్లద్దాలు వాడాలి. ఛాయలో నడవడం మంచిది.

3. లైట్ మరియు కాటన్ దుస్తులు వేసుకోండి...
పొడి గాలి ద్వారా శరీర ఉష్ణోగ్రత పెరగకుండా ఉండేందుకు కాటన్ దుస్తులు ఉపయోగపడతాయి. ఇవి శరీరానికి హితమైనవిగా ఉంటాయి. బహుళ రంగు లేదా గాఢమైన దుస్తులు వేడి ఎక్కువగా ఇస్తాయి. తెలుపు లేదా లైట్ కలర్స్ ఉత్తమం. ఇది చల్లదనం కలిగిస్తుంది.

4. చల్లదనాన్ని ఇచ్చే ఆహారం తీసుకోండి...
వెల్లుల్లి, పెరుగు, తాటి ముంజలు, వాటర్ మిలాన్ వంటి పదార్థాలు శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. వీటిలో నీరు అధికంగా ఉండడం వల్ల వేడి తగ్గుతుంది. బాహ్య ఉష్ణోగ్రతల ప్రభావాన్ని తగ్గించేందుకు సహాయపడతాయి. రోజు ఆహారంలో ఇవి ఉండేలా చూసుకోవాలి.

5. మసాలా మరియు జంక్ ఫుడ్ మానేయండి...
వేడి కాలంలో ఎక్కువ మసాలా వంటకాలు, చిప్స్, ఫ్రైటెంస్ తినడం వల్ల జీర్ణ క్రియ మందగిస్తుంది. ఇవి శరీర ఉష్ణోగ్రతను పెంచుతాయి. పెట్టుబడి మరియు లేత పదార్థాలను మాత్రమే తీసుకోవాలి. పెరుగు అన్నం, పల్స్ సూప్ వంటి వాటిని ప్రిఫర్ చేయాలి.

6. సన్ స్క్రీన్ ఉపయోగించండి...
వేడి కిరణాల ప్రభావం నుంచి చర్మాన్ని కాపాడటానికి సన్‌స్క్రీన్ అవసరం. కనీసం ఎస్‌పిఎఫ్ 30 కలిగినది వాడాలి. వీటిని బయటకు వెళ్లేముందు 30 నిమిషాల ముందు అప్లై చేయాలి. చర్మాన్ని రక్షించడం వల్ల అలర్జీలు, టాన్ తప్పుతుంది.

7. ఆహారాన్ని మానవద్దు...
ఎండాకాలంలో ఆకలి లేకపోవడం సాధారణం అయినా, సమయానికి ఆహారం తినాలి. బాడీలో ఎనర్జీ తగ్గకుండా ఉండేందుకు ఇది అవసరం. ప్రోటీన్, మినరల్స్, కర్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకోవాలి. బలహీనత, నీరసం నుండి కాపాడుతుంది.

8. తగిన విశ్రాంతి తీసుకోండి...
వేడి అధికంగా ఉండే సమయంలో శరీరానికి విశ్రాంతి అవసరం. సుమారు 15 30 నిమిషాలు మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటే శరీరం చల్లబడి మళ్లీ శక్తిగా మారుతుంది. తలతిరుగు, నీరసం తగ్గుతుంది. ఒత్తిడిని తగ్గించడంలో కూడా ఇది ఉపయుక్తం.

9. ఎక్కువ శారీరక శ్రమ వద్దు...
వేడి కాలంలో హార్డ్ ఫిజికల్ వర్క్ చేయడం వల్ల శరీరం త్వరగా అలసిపోతుంది. ప్యారాసిటమోల్ వంటి మందులు తీసుకునే వారికి ఇది మరింత ప్రమాదకరం. వేడి సమయంలో అధిక శ్రమ చేయకుండా ఉండాలి. పని విశ్రాంతి మధ్య్య సమతుల్యత అవసరం.

10. ఇంటి చుట్టూ చల్లదనం ఉంచండి..
ఇంట్లో గాలివేడి తగ్గించేందుకు కర్టెన్లు వాడాలి. తడి గుడ్డలు తలుపులపై ఉంచితే చల్లదనం పెరుగుతుంది. నాన్నినట్లగా నేలతో పాటు గోడలు కూడా చల్లబెడతాయి. పెద్దవాళ్లకు ఇది మరింత అవసరం.

11. రోజు రెండు సార్లు స్నానం చేయండి..
ఒకసారి ఉదయం, ఒకసారి సాయంత్రం స్నానం చేస్తే శరీర వేడి తగ్గుతుంది. శరీరంలోని మురికి, చెమురు పోయి చల్లదనం వస్తుంది. వాసనతో పాటు ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది. తాజాదనాన్ని కలిగిస్తుంది.

12. పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి..
వీరు శరీరం వేడి తట్టుకోలేరు. వాళ్ళను బయట పంపేటప్పుడు టోపీ, నీరు, చల్లదనపు పదార్థాలు ఇవ్వాలి. రూములో వాతావరణం చల్లగా ఉండేలా చూడాలి. వేడి వల్ల వేగంగా డీహైడ్రేషన్ జరుగుతుంది.

13. సహజ చల్లదన పద్ధతులు...
తాటి ముంజలు, బుట్టల బియ్యం నీళ్లు సహజ శరీర చల్లదనాన్ని ఇస్తాయి. వీటిని తరచూ వాడడం వల్ల శరీరం వేడి తగ్గుతుంది. బయట నుంచి వచ్చిన వెంటనే చల్లటి నీటితో ముఖం కడుక్కోవాలి. ఇది ఫ్రెష్‌గా ఫీలవడానికి సహాయపడుతుంది.

14. కాఫీ, మద్యం తగ్గించండి...
ఇవి డీహైడ్రేషన్‌కు దారి తీస్తాయి. శరీరంలోని నీటి శాతం తగ్గించడంతో నీరసం, తలనొప్పి వస్తాయి. బదులుగా నిమ్మకాయ, బుట్టల బియ్యం నీళ్లు తాగాలి. ఇవి శరీరాన్ని చల్లబెడతాయి.

15. హీట్ స్ట్రోక్ లక్షణాలు గమనించండి...
తల తిరగడం, అధిక ఒళ్ళు వేడి, విరేచనం, బలహీనత కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. వెయిట్ లాస్, చర్మం ఎర్రగా మారడం కనిపిస్తే అలసత్వం వద్దు. ఇది ప్రమాదకరమైన పరిస్థితి కావచ్చు. ఆరోగ్య సూచనలు పాటించడం తప్పనిసరి.

ఎండాకాలం అనేది ఆరోగ్యపరంగా సవాలుతో కూడిన కాలం. సరైన జాగ్రత్తలు తీసుకుంటే మనం ఈ వేడి కాలాన్ని సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదుర్కోవచ్చు. తగిన ఆహారం, నీరు, విశ్రాంతి మరియు చల్లదనపూరిత జీవన శైలితో ఈ కాలాన్ని ఆనందంగా గడపవచ్చు. వృద్ధులు, పిల్లలు, గర్భిణీలు మరింత శ్రద్ధ వహించాలి. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న మాటను ఎప్పటికీ గుర్తుంచుకోవాలి.